క్లుప్తంగా

ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోండి

పామిడి: బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రహ్మణ, కాపు, బలిజ కులాలకు సంబంధించిన నిరుద్యోగ యువత ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కే తేజోత్స్న బుధవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 30 నుంచి వచ్చే నెల 7లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే బీ ఫార్మసీ, డీ ఫార్మసీ చేసిన బీసీ/ఈబీసీ నిరుద్యోగ యువత జనరిక్ మెడికల్ షాపుల కోసం దరాఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వీరారెడ్డిపల్లిలో 'పొలం పిలుస్తోంది'


రైతులకు సూచనలిస్తున్న అధికారులు

యాడికి: వీరారెడ్డిపల్లిలో బుధవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మహబూబ్ బాషా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించిదని, నివారణ కోసం క్లోరిఫైరిఫాస్ 20 శాతం ఈసీ 2.5 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న మొవ్వ సుడులు బాగా తడిసేలా ముందు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ లలిత, రిలయన్స్ అధికారి గిరిబాబు, రైతులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ జబ్బార్ మియా బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమవుతుందని, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు హాజరు కావాలని కోరారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం


శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ చేతుల మీదగా ఉత్తమ అవార్డు అందుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాను బుధవారం గుత్తి ఆర్‌ఎస్‌లో ఘనంగా సన్మానించారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది మహబూబ్ బాషాను శాలువాలు,పూల మాలలతో సత్కరించారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు తీసుకోవాలని ఆకాంక్షించారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు


గాయపడిన పవన్

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో పవన్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామానికి చెందిన పవన్ బాచుపల్లి గ్రామంలోని క్రషర్‌కు వెళ్తుండగా కర్నూలు వైపునకు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా వచ్చి పవన్ బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన పవన్‌ను గమనించిన స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దేవరకొండ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


హైమాస్ లైట్లను అందిస్తున్న సర్పంచ్ పార్వతి

బుక్కరాయసముద్రం: ప్రముఖ్య పుణ్యక్షేత్రం దేవరకొండ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజక వర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు, బీకేఎస్ మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి పేర్కొన్నారు. కొండమీద రాయుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం 100 హైమాస్ లైట్లును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 5వ నుంచి కొండమీ రాయుని బ్రహ్మోత్సవాలు 10 రోజులుగా నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సదాశివ, కార్యదర్శి సర్దార్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనాథ్, చందు, నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆ బడి..

ప్రకృతి ఒడి!

- గణిత ఉపాధ్యాయుడి చొరవ
- హరితవనంలా నగరూరు ఉన్నత పాఠశాల
- ఇతర పాఠశాలలకు ఆదర్శంగా మారిన వైనం



స్వాగత తోరణంలా పచ్చని చెట్లు


చెట్ల మధ్యన చదువుకుంటున్న నగరూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు

యాడికి: ఏపుగా పెరిగిన చెట్లు. ఎప్పుడూ చల్లగా ఉండే వాతావరణం, ఆహ్లాదకరంగా పరిసరాలు. అక్కడ ఉంటే ప్రకృతి ఒడిలో ఉన్నట్లే ఉంటుంది. ఇదేదో పార్కు అనుకుంటే పప్పులో కాలేసినట్లే. ఎందుకంటే ఇది నగరూరు ఉన్నత పాఠశాలలోని పరిస్థితి. పాఠశాల పదుల సంఖ్యలో చెట్లతో పచ్చదనం అలరారుతోంది. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 130 మంది విద్యార్థులు చదువుతున్నారు.

తొమ్మిదేళ్లుగా మొక్కల పెంపకం

2015లో గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు హరితహారంలో భాగంగా 200 మొక్కలను విద్యార్థులతో నాటించారు. ఇందులో వేప, రామబాణం, అశోక, పూలు, అలంకరణ తదితర మొక్కలు ఉన్నాయి. విద్యార్థులకు ఒక మొక్క చొప్పున సంరక్షణ బాధ్యత అప్పగించారు. విద్యార్థులు వాటికి క్రమం తప్పకుండా నీటిని అందించి సంరక్షించారు. ఇక వేసవి సెలవుల్లో నీరు పోసేందుకు ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తన సొంత డబ్బుతో ప్రత్యేకంగా ఒక వ్యక్తిని నియమించాడు. దీంతో మొక్కలు ఏపుగా పెరిగి పెద్దవై నీడతో పాటు చల్లని గాలిని ఇస్తున్నాయి. విద్యార్థులు కూడా పాఠశాల భవనంలో కన్నా చెట్ల కింద హాయిగా చదువులు సాగిస్తున్నారు. పాఠశాల చుట్టూ బయో ఫెన్సింగ్‌లా ఉంటున్నాయి. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు చెట్ల కిందనే కూర్చొని భోజనం చేస్తున్నారు.

పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

పచ్చదనంతో పాటు మెరుగైన బోధన అందిస్తుండటంతో పాఠశాల విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. గత విద్యాసంవత్సరంలో 113 మంది ఉండగా ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 130కి చేరింది. గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు నగరూరు ఉన్నత పాఠశాలలో 2014 నుంచి 2019 వరకు నగరూరు ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై పెద్దపప్పూరుకు వెళ్లారు. మళ్లీ గతేడాది బదిలీపై ఇక్కడికే వచ్చాడు. గ్రామస్తుల సహకారం, తన స్నేహితుల ఇచ్చిన విరాళాలతో ఇటీవల రూ.2.5 లక్షలతో సమావేశపు గదిని నిర్మించాడు. చదువులో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సాహకాలతో ప్రోత్సహిస్తున్నారు.

చల్లనినీడలో చదువుకుంటున్నాం



మా పాఠశాలలో చెట్లు ఏపుగా పెరిగి నీడను ఇస్తున్నాయి. పాఠశాల గది కన్నా మాకు చెట్ల కింద చదువుకోవటం బాగుంటుంది. వేసవిలో కూడా మా పాఠశాల వాతావరణం చల్లగా ఉంటుంది. ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యనభ్యసిస్తున్నాం.

– వాసుదేవరెడ్డి, 10వ తరగతి విద్యార్థి, నగరూరు ఉన్నత పాఠశాల

మా పాఠశాలంటే ఎంతో ఇష్టం



పాఠశాల లోపలికి వచ్చిన తర్వాత వాతావరణమే వేరుగా ఉంటుంది. చుట్టూ చెట్లు ఉండటంతో వేసవిలో కూడా ఎండ కనిపించదు. అధికారులు ఇక్కడికి వస్తే వాతావరణాన్ని చూసి తొందరగా వెళ్లరు. మా పాఠశాల అంటే మాకు ఎంతో ఇష్టం.

–పూజిత, నగరూరు ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని

ఆహ్లాదకర వాతావరణం



రెండేళ్ల క్రితం బదిలీపై ఇక్కడికి వచ్చాను. గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు చొరవతోనే స్కూల్‌లో పచ్చదనం పరుచుకుంది. ఆయన పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇక్కడి వాతావరణం కారణంగా విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా చదువుకుంటున్నారు.

– కుళ్లాయప్ప, హెచ్‌ఎం, నగరూరు ఉన్నత పాఠశాల

అందరి సహకారంతో పాఠశాల అభివృద్ధి



మొక్కలు పెంచటంతో పాటు వాటిని సంరక్షించడం ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి ఎంతో ఉంది. అందరి సహాయ సహకారాలతోనే పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నా. ఇటీవల పాఠశాలలో సమావేశ గదిని కట్టించాం.

– శ్రీనివాసులు, గణిత ఉపాధ్యాయుడు

సజావుగా మండల మీట్

గార్లదిన్నె: స్థానిక రైతు సేవా కేంద్రంలో బుధవారం ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాబా ఫ్రక్రుద్దీన్, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా నిలిచేందుకే 'ఫీజు పోరు'


రవిచంద్రతో కాశీమనోజ్

తాడిపత్రిటౌన్: పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకే వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు కార్యక్రమం తలపెట్టిందని తాడిపత్రి వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజక వర్గ అధ్యక్షుడు కాశీమనోజ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్రను కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించారు. అనంతరం ఫీజుపోరు కార్యక్రమం నిర్వహణపై చర్చించినట్లు కాశీమనోజ్ తెలిపారు.

సాంకేతిక విప్లవంతో పెనుమార్పులు



మాట్లాడుతున్న రెక్టార్ వెంకటనాయుడు

గుంతకల్లు: సాంకేతిక విప్లవంతో ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు సంభవిస్తున్నాయని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో గురువారం 'విజన్ వికసిత్ భారత్ 2047, ఆధునిక పరిశ్రమల ద్వారా ఆర్థిక శ్రేయస్సు, 4.0 అనే అంశాలపై జాతీయ సెమినార్ నిర్వహించారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రికార్డ్ ప్రొఫెసర్ వెంకటనాయుడు, కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్, బెంగళూరుకు చెందిన కాగ్నిజెంట్ కంపెనీ సీనియర్ మేనేజర్ బీ.సంపత్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ హరిజిత్‌రాయ్ తదితరులు మాట్లాడారు. దేశం అభివృద్ధి పథంలో ఉండాలంటే విద్య, పరిశోధనలు, నవకల్పనలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సెమినార్ ద్వారా నేర్చుకున్న విషయాలను ఆచరణ పెట్టాలని పిలుపునిచ్చారు. సప్తగిరి ఎస్‌పీఎస్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనుశ్రీ బెనర్జీ, కళాశాల డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సెమినార్ డైరెక్టర్ వరప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ నటరాజ్, పీ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సేవాగఢ్ ఉత్సవాలు జయప్రదం చేయండి


సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

గుత్తి రూరల్: చెర్లోపల్లి పంచాయతీలోని సేవాగఢ్‌లో ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో జరగనున్న సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 286వ జయంత్యుత్సవాలను విజయవంతం చేద్దామని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామాంజనేయులు, ఆర్డీఓ శ్రీనివాస్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసులు అధికారులకు సూచించారు. సేవాగఢ్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో సేవాలాల్ జయంతి ఉత్సవ ఏర్పాట్లపై బుధవారం సేవాగఢ్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్ పై అధికారులతో కలిసిసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయంత్యుత్సవాలకు వచ్చే భక్తుల ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండల నుంచి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులకు ఆదేశించారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, తాత్కాలికంగా స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని అన్నారు. ఆయా శాఖల అధికారులందరూ సేవాగఢ్‌లోనే ఉండి ఏర్పాట్లను సమీక్షించాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హెచ్చరించారు. ఉత్సవాల సందర్భంగా సమీప గ్రామాల్లో నాటుసారా అమ్మకాలు జరగకుండా చూడాలని ఎక్సైజ్ అధికారులకు ఆదేశించారు. అంతకు ముందు అధికారులు సేవాలాల్ మహరాజ్, మాతా జగదాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబులేసు, సర్పంచ్ అప్పా వెంకటేష్, సీఐ వెంకటేశ్వర్లు, ఈఓఆర్డీ శివాజీరెడ్డి పాల్గొన్నారు

పింఛన్‌దారుల అర్హతల పునఃపరిశీలన


పుట్లూరులో పింఛన్‌దారుడితో వివరాలు సేకరిస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆరోగ్య పింఛన్లకు సంబంధించి అధికారులు బుధారం పింఛన్‌దారుల అర్హతను పునఃపరిశీలించారు. మండల వ్యాప్తంగా 35 మందికి ఆరోగ్య పింఛన్లు అందిస్తున్నారు. ఎంపీడీఓ అలివేలమ్మ, వైద్యాధికారి హిమబిందు లబ్ధిదారుల ఇళ్లకు వద్దకు వెళ్లి వారి అర్హతలను పరిశీలించారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు వివరించారు.

యల్లనూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆరోగ్య పింఛన్లకు సంబంధించి బుధవారం అధికారులు పింఛన్‌దారుల అర్హతను పరిశీలించారు. మొత్తం 53 మంది అర్హతను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

పెద్దవడుగూరు : మండలంలోని 38 మెడికల్ పింఛన్లను వైద్యాధికారులు పునః పరిశీలించారు. డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, పెద్దవడుగూరు, క్రిష్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాసబాబు, అమర్‌నాథ్, శ్రీనివాసరెడ్డి బుధవారం ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి సదరం సర్టిఫికెట్లు, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ నరసింహారెడ్డి తెలిపారు.

మహిళకు తీవ్రగాయాలు

గుత్తి: పట్టణ శివారులోని తాడిపత్రి రోడ్డుపై బుధవారం బైక్‌లో నుంచి జారి కింద పడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలు.. రాయలచెరువు గ్రామానికి చెందిన రామక్క తన భర్తతో కలిసి బైక్‌పై గుత్తికి వచ్చింది. తిరిగి బైక్‌లో స్వగ్రామానికి వెళుతుండగా ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి జారి కింద పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యం


అధ్యాపకులను అభినందిస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి సాంకేతిక విద్యను అందించడమే తమ లక్ష్యమని ఎస్ఆర్ఐటీ కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రోటరీపురంలోని ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల ఏఐసీటీఈ విద్యా మంత్రిత్వ ఇన్నోవేషన్ సెల్ (ఎంఐసీ) 3.5 రేటింగ్ స్టార్ అందున్న సందర్భంగా అధ్యాపకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటెక్ విద్యార్థులకు చదువులతో పాటు మంచి సాంకేతిక నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. తమ క్యాంపస్‌లో ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూమర్‌షిప్‌ను పెంపొందించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఏఐసీటీఈ విద్యా మంత్రిత్వ ఇన్నోవేషన్ సెల్ 3.5 స్టార్ రేటింగ్ అందుకుందన్నారు. ఈ గుర్తింపు విద్యార్థులు, అధ్యాపకుల కార్యకలాపాల ద్వారా లభించిందన్నారు. అనంతరం అధ్యాపకులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ఐఐసీ అధ్యక్షుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఐఐసీ కన్వీనర్ డాక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన మసూద్ గాజి ఉరుసు

శింగనమల: స్థానిక హజరత్ సయ్యద్ సాలార్ మసూద్ గాజి దర్గా ఉరుసు బుధవారం జియారత్‌తో ముగిసింది. ఉదయం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు. మండలంలోని చుట్టు పక్కన గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వ్యాపారాలు నిర్వహించే షాపుల్లో నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ కౌలుట్లయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల చోరీలు అరికట్ట వచ్చునన్నారు. ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

వైన్‌షాపులో చోరీ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరు రోడ్డులో ఉన్న ఎస్‌వీ వైన్‌షాప్‌లో చోరీ జరిగింది. బుధవారం వేకువజామున గుర్తుతెలియని దుండగులు షాపు షట్టర్‌కు వేసిన తాళాలను పగులగొట్టి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.35 వేల నగదుతో పాటు రూ.20 వేలు విలువ చేసే మద్యంబాటిళ్లను అపహరించుకెళ్లినట్లు సీఐ మనోహర్ తెలిపారు. షాపు మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

1న జిల్లా జైల్లో వేలం పాట

బుక్కరాయసముద్రం: మండలంలోని జిల్లా జైల్లో ఫిబ్రవరి 1న వేరుశనగ చెక్కకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ రహ్మాన్ తెలిపారు. దాదాపు 25 వేల కేజీల వేరుశనగ చెక్కకు వేలం పాట నిర్వస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

గుంతకల్లు: పట్టణంలోని 29వ వార్డులో గురువారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్యాస్ ఫైర్, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, మాజీ కౌన్సిలర్ రామాంజనేయులు, సచివాలయ సెక్రటరీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలో ఫిబ్రవరి 6 నుంచి 14 వరకూ జరిగే బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీఓ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. తహసీల్దార్ ఓబిలేసు, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్‌తో కలిసి బుధవారం గ్రామంలో పర్యటించారు. బ్రహ్మోత్సవాలు జరిగే 10 రోజుల పాటు వాహనాల పార్కింగ్, దుకాణాల ఏర్పాటు, రథోత్సవం జరిగే ప్రాంతాలను వారు పరిశీలించారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈఓ రామాంజనేయులు వివరించారు. అధికారులు బొలికొండ రంగనాథ స్వామిని దర్శించుకున్నారు. ఈఓఆర్డీ శివాజీరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

3న తొండపాడులో టెంకాయల వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో తిరునాల సందర్భంగా టెంకాయల విక్రయానికి ఫిబ్రవరి 3న వేలం పాట నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ఈఓ రామాంజనేయులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెంకాయల వేలంతో పాటుగా ఫిబ్రవరి 15 నుంచి 2026 పుష్యమాసం ఆఖరు వరకూ ఏడాది పాటు టెంకాయల విక్రయానికి అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు వేలం పాట ఉంటుందని తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు దేవాలయ అధికారి వద్ద రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నారాయణ కళాశాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

పామిడి: విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న అనంతపురం నారాయణ కళాశాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ డిమాండ్ చేశాడు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల కళాశాల యాజమాన్యపు ఫీజుల ఒత్తిళ్లు తాళలేక ఇంటర్ విద్యార్థి చరణ్ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఇంతా జరిగినా విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమన్నారు. తక్షణం నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవడంతోపాటు బాధిత విద్యార్థి కుటుంబానికి న్యాయం చేకూర్చాలన్నారు.

కార్మికులను వేధిస్తున్న ఏఈపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

గుంతకల్లుటౌన్: కార్మికులను వేధిస్తున్న మున్సిపల్ ఏఈ హరిక్రిష్ణపై చర్యలు తీసుకోవాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఐఎఫ్‌టీయూ నాయకులు కార్మికులను కలిసిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. గతంలో ఎస్ఎస్.ట్యాంకు వద్ద నరికేసిన భారీ వృక్షాల మొద్దులను అక్కడే పనిచేస్తున్న మస్తాన్ అనే ఔట్‌సోర్సింగ్ కార్మికుడి సాయంతో డిపోలకు అమ్మేసి ఏఈ సొమ్ము చేసకున్నారని ఆయన ఆరోపించారు. వీరి అక్రమాలు బయటికి పొక్కడంతో స్క్రాప్ పోయిందన్న సాకును చూపి అక్కడ పనిచేస్తున్న 15 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులపై నిందలు మోపాలని చూడటం సరికాదన్నారు. ఎవరు దొంగలించారో చెప్పకపోతే ఉద్యోగం నుంచి తీసివేయిస్తానని ఏఈ కార్మికులను బెదిరించడం సరికాదన్నారు. కార్మికులను వేధిస్తున్న ఏఈపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడుతామని సురేష్ పేర్కొన్నారు. ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి రామాంజినేయులు, నాయకులు జిలాన్, నారాయణ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

తాడిపత్రిటౌన్: తాడిపత్రిలోని పురాతన ఆలయాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని తాడిపత్రి బీజేపీ నాయకులు 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌ను కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో వారు ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. తాడిపత్రి ప్రాంతంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి, చింతలవెంకటరమణ స్వామి, ఆలూరు రంగనాయకుల స్వామి, పెద్దపప్పూరులోని అశ్వత్థం ఆలయాలను ఏపీ పర్యాటక రంగంలోకి తీసుకొని అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్, ఓబీసీ మోర్చా రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, గజ్జల పృథ్వీనాథ్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిరంజన గురురంగస్వామి ఆరాధన

పుట్లూరు: ఎస్.తిమ్మాపురం గ్రామంలో బుధవారం నిరంజన గురురంగస్వామి ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఊరేగింపు చేపట్టారు. భక్తులకు అన్నదానంతోపాటు నాటక ప్రదర్శన జరిగింది. అనంతరం నిర్వహించిన ట్రాక్టర్ రివర్స్ పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇందులో కొనగుంటపల్లికి చెందిన ఎద్దుల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మొదటి స్థానంలో నిలిచి రూ.10 వేలు, కొరివిపల్లి శ్రీకాంత్‌రెడ్డి రెండో స్థానంలో నిలిచి రూ.5వేలు గెలుపొందినట్లు పోటీల పర్యవేక్షకుడు అమర్‌నాథరెడ్డి తెలిపారు.